
సాక్షి
ఖమ్మం
బుధవారం । 25 । జూన్ । 2025



సులువుగా కాపాడేలా..

వరదల్లో చిక్కుకున్న వారిని సులువుగా బయటకు తీసుకొచ్చేలా అగ్నిమాపక శాఖకు రెండు ప్రత్యేక బోట్లు కేటాయించారు. 8లో



... అదనపు ఆదాయం

అపరాల సాగుకు ఇదే అనువైన సమయం కాగా.. రకాల ఎంపిక, ఇతర జాగ్రత్తలపై శాస్త్రవేత్తలు సూచనలు చేస్తున్నారు. 8లో

వాతావరణం

గరిష్ఠం / కనిష్ఠం
33° / 26°

జిల్లాలో బుధవారం ఆకాశం మేఘావృతమై ఉంటుంది. పలుచోట్ల జల్లులు మొదలు ఓ మోస్తరు వర్షం కురిసే అవకాశముంది.

న్యూస్‌రీల్

మైనార్టీల సంక్షేమానికి ప్రభుత్వం కృషి



ఉర్దూఘర్ మరమ్మతులపై ఆరాతీస్తున్న చైర్మన్

ఖమ్మం మామిళ్లగూడెం: మైనార్టీల సంక్షేమానికి ప్రభుత్వం అన్నిరకాలుగా కృషి చేస్తుందని ఉర్దూ అకాడమీ చైర్మన్ తాహెర్ బిన్ హందాన్ తెలిపారు. ఖమ్మంలోని ఉర్దూఘర్, షాదీఖానాను మంగళవారం సందర్శించిన ఆయన మాట్లాడారు. మైనార్టీలంతా ఐకమత్యంగా ఉంటూ సంక్షేమ పథకాలను వినియోగించుకోవాలని సూచించారు. అనంతరం షాదీఖానా మరమ్మతులపై జిల్లా మైనార్టీ సంక్షేమ అధికారి బి.పురంధర్, తహసీల్దార్ సైదులు, మున్సిపల్ ఈఈ కృష్ణాలాల్, స్థానిక నాయకులతో చర్చించి సూచనలు చేశారు. రాష్ట్ర ఉర్దూ అకాడమీ ఏడీ వి.కృష్ణ, ఉద్యోగులు షేక్ ఇస్మాయిల్, పి.అతాఉల్లా ఖాన్, రజాబలీ, నాయకుడు ఛోటేబాబా తదితరులు పాల్గొన్నారు.

సాహసవీరుల అవార్డుకు దరఖాస్తుల ఆహ్వానం

ఖమ్మం రాపర్తినగర్: జాతీయస్థాయిలో సాహసవీరులకు అందించే నేషనల్ అడ్వెంచర్ అవార్డుకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు డీవైఎస్‌ఓ టి.సునీల్‌కుమార్‌రెడ్డి తెలిపారు. కేంద్ర యువజన సర్వీసుల మంత్రిత్వ శాఖ ఈ అవార్డులు ఇవ్వనుందని వెల్లడించారు. ధైర్య సాహసాలు ప్రదర్శించిన వారికి వ్యక్తిగత అవార్డులు ఇవ్వనుండగా, 2022, 2023, 2024 సంవత్సరాలకు అర్హులు దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. వివరాలకు https// awards. gov. in వెబ్‌సైట్‌లో పరిశీలించి దరఖాస్తు చేసుకోవచ్చని డీవైఎస్‌ఓ తెలిపారు.

రేపు మెడికల్ కళాశాలను తనిఖీ చేయనున్న డీఎంఈ

ఖమ్మంవైద్యవిభాగం: ఖమ్మం ప్రభుత్వ మెడికల్ కళాశాలను డీఎంఈ నరేందర్‌కుమార్ గురువారం తనిఖీ చేయనున్నారు. కళాశాలతో పాటు ప్రభుత్వ జనరల్ ఆస్పత్రిని సైతం తనిఖీ చేయనున్న ఆయన అవసరమైన మౌలిక వసతుల కల్పనపై సమీక్షించనున్నారు. రాష్ట్రంలోని ప్రభుత్వ మెడికల్ కళాశాలల్లో సదుపాయాలపై ఇటీవల నేషనల్ మెడికల్ కమిషన్ (ఎన్‌ఎంసీ) అసంతృప్తి వ్యక్తం చేసిన విషయం విదితమే. ఇందులో భాగంగా నిబంధనల ప్రకారం ఏర్పాట్లు లేవని పలు కళాశాలలకు నోటీసులు జారీ చేయగా, మూడో ఏడాదికి ప్రవేశాలకు ఖమ్మం ప్రభుత్వ మెడికల్ కళాశాలకు అనుమతి ఇచ్చినా లోటుపాట్లను మూడు నెలల్లో సరిచేసుకోవాలని ఆదేశించింది. ఈమేరకు కళాశాలలో బోధన సిబ్బంది, సరిపడా ల్యాబ్‌లు, తరగతి గదులు, హాస్టళ్లు ఉన్నాయా, లేదా పరిశీలించి ఏర్పాట్లపై సూచనలు చేసేందుకు డీఎంఈ గురువారం రానున్నారు. డీఎంఈతో పాటు ఉస్మానియా మెడికల్ కళాశాల ప్రిన్సిపాల్, ఇతర అధికారులు ఈ బృందంలో ఉంటారని తెలిసింది.

నేత్రపర్వంగా రామయ్య నిత్యకల్యాణం

భద్రాచలం: భద్రాచలం శ్రీ సీతారామచంద్ర స్వామి వారి నిత్యకల్యాణ వేడుక మంగళవారం నేత్రపర్వంగా సాగింది. తెల్లవారుజామున గర్భగుడిలో స్వామి వారికి సుప్రభాత సేవ, సేవా కాలం, ఆరాధన తదితర పూజలు చేశారు. అనంతరం బేడా మండపంలో కొలువుదీర్చి విశ్వక్సేన పూజ, పుణ్యాహవాచనం చేశారు. ఆ తర్వాత స్వామి వారికి కంకణధారణ, యజ్ఞోపవీత ధారణ, అమ్మవారికి కంకణధారణ, యోక్త్రధారణ గావించి నిత్యకల్యాణ ఘట్టాన్ని అర్చకులు శాస్త్రోక్తంగా నిర్వహించారు. కాగా, మంగళవారాన్ని పురస్కరించుకుని ఆంజనేయస్వామికి అభిషేకం, ప్రత్యేక పూజలు చేశారు.

గిరిజన మ్యూజియం భేష్..

'మోటా' ప్రత్యేకాధికారి సుభాష్

భద్రాచలంటౌన్: ఆదివాసీ గిరిజనుల సంస్కృతి సంప్రదాయాలు అంతరించిపోకుండా నాటి ఆనవాళ్లతో ఏర్పాటుచేసిన గిరిజన మ్యూజియం బాగుందని కేంద్ర ప్రభుత్వ గిరిజన సంక్షేమ శాఖ ప్రత్యేకాధికారి సుభాష్ అన్నారు. భద్రాచలం డివిజన్‌లో రెండు రోజుల పర్యటన నిమిత్తం వచ్చిన ఆయన మంగళవారం ఐటీడీఏ ప్రాంగణంలోని మ్యూజియాన్ని సందర్శించి కళాఖండాలు, పెయింటింగ్‌లు చూడడంతో పాటు గిరిజన వంటకాలను ఆస్వాదించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ పర్యాటకులకు కనువిందు కలిగేలా ట్రైబల్ మ్యూజియం రూపొందించడం హర్షణీయమని అన్నారు. కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెడుతున్న సంక్షేమ పథకాలు గిరిజనులకు సక్రమంగా అందిస్తున్న ఐటీడీఏ అధికారులను అభినందిస్తున్నట్లు తెలిపారు. ఆయన వెంట ఐటీడీఏ పీఓ బి.రాహుల్, ఏపీఓ డేవిడ్ రాజ్, జేడీఎం హరికృష్ణ తదితరులు ఉన్నారు.

అప్రమత్తంగా ఉన్నాం..



సాక్షి INTERVIEW

సీజనల్ వ్యాధుల కట్టడి, వరద నివారణకు ప్రణాళికలు

- రైతులకు అందుబాటులో విత్తనాలు, ఎరువులు
- భూభారతి దరఖాస్తుల పరిష్కారంపై ప్రత్యేక దృష్టి
- కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి

సాక్షిప్రతినిధి, ఖమ్మం: 'వర్షాకాలం ప్రారంభమైనందున సీజనల్ వ్యాధులు ప్రబలకుండా అన్ని చర్యలు చేపడుతున్నాం. జిల్లాలో మలేరియా, చికున్‌గున్యా లేవు. గత ఏడాది డెంగీ కేసులు నమోదైనందున ఈసారి పునరావృతం కాకుండా ప్రణాళికాయుతంగా వ్యవహరిస్తున్నాం. గత ఏడాది మున్నేటి వరదల దృష్ట్యా ఈసారి ముందస్తు రక్షణ చర్యలపై దృష్టి సారించాం. వ్యవసాయ పనులు ప్రారంభమైనందున రైతులకు ఎరువులు, విత్తనాలు సమకూర్చగా.. భూభారతి సదస్సుల్లో అందిన 75 వేల దరఖాస్తుల పరిశీలన కొనసాగుతోంది. వచ్చేనెల 1నుంచి వన మహోత్సవాన్ని పెద్ద ఎత్తున నిర్వహించేలా ఏర్పాట్లు చేస్తున్నాం. అంతేకాక జిల్లాలో అందరికీ మెరుగైన విద్య, వైద్యం అందేలా కార్యచరణ రూపొందించాం' అని కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి వెల్లడించారు. కలెక్టర్‌గా ఇటీవల బాధ్యతలు చేపట్టిన అనుదీప్ తొలిసారి మంగళవారం 'సాక్షి'కి ఇచ్చిన ఇంటర్వ్యూలో వెల్లడించిన వివరాలు ఆయన మాటల్లోనే...

● హాట్‌స్పాట్లను గుర్తిస్తున్నాం..

జిల్లాలో మలేరియా, చికున్‌గున్యా లేకపోగా.. గత ఏడాది డెంగీ కేసులు ఎక్కువగా నమోదయ్యాయి. తిరుమలాయపాలెం తదితర ప్రాంతాల్లో ఈ కేసులు అధికంగా వచ్చాయి. ఆయా ప్రాంతాలను హాట్‌స్పాట్లుగా గుర్తించి స్పెషల్ డ్రైవ్ చేపట్టాలని ఆదేశించాం. ఫ్రైడే- డ్రైడే ద్వారా ఇంటింటా అవగాహన కల్పిస్తాం. డ్రెయిన్లు, నీరు నిల్వ ఉన్న ప్రాంతాల్లో యాంటీ లార్వా, ఆయిల్‌బాల్స్ వేయిస్తాం. ఆశాలు, ఏఎన్‌ఎంలు ఇంటింటికీ వెళ్లి జ్వర సర్వే చేసి అనుమానితులకు పరీక్షలు చేస్తారు. అలాగే ప్రైవేట్ ఆస్పత్రుల్లో డెంగీ, చికున్‌గున్యా కేసులు నమోదైతే వెంటనే సమాచారం ఇచ్చేలా ఆదేశాలు జారీ చేస్తాం.

● సరిపడా విత్తనాలు, ఎరువులు

ఈ వానాకాలం సీజన్‌లో అన్నీ కలిపి 6.10 లక్షల ఎకరాల్లో పంటలు సాగవుతాయని అంచనా. ఇందులో 3లక్షల ఎకరాల్లో వరి, 2.25 లక్షల ఎకరాల్లో పత్తి, 65 వేల ఎకరాల్లో మిర్చి సాగవుతుందని భావిస్తున్నాం. ఇందుకు సరిపడా విత్తనాలు, ఎరువులు అందుబాటులోకి తీసుకొస్తున్నాం. అన్ని షాపుల్లో అమ్మకాలను ప్రతిరోజు ఆరా తీస్తున్నాం. ఏఈఓ మొదలు జిల్లా అధికారుల వరకు విత్తన దుకాణాల్లో తనిఖీలు చేస్తున్నందున డీలర్లు అవకతవకలకు పాల్పడినట్లు తేలితే చర్యలు తీసుకుంటాం.

● కారణాలు వివరిస్తాం..

భూభారతి సదస్సుల్లో 75 వేల దరఖాస్తులు వచ్చాయి. ఇందులో కొన్నింటిని పరిశీలించాం. దరఖాస్తులన్నీ క్షుణ్ణంగా పరిశీలించాక సాధ్యమైనంత త్వరగా పరిష్కరించేలా చూస్తున్నాం. ఒకవేళ ఏదైనా దరఖాస్తును పరిష్కరించలేకపోతే అందుకు కారణాలను దరఖాస్తుదారుడికి వివరిస్తాం. సాదాబైనామా దరఖాస్తులపై ప్రభుత్వం నుంచి మార్గదర్శకాలు వెలువడాల్సి ఉంది.

● 'ఇందిరమ్మ' లబ్ధిదారులకు అవగాహన

జిల్లాలో ఇందిరమ్మ ఇళ్ల కోసం అందిన దరఖాస్తుల పరిశీలన పూర్తయింది. ఇప్పటికే 12వేల మందికి ఇళ్లు మంజూరు చేశాం. కొన్ని ఇళ్లు గ్రౌండింగ్ అయ్యాయి. ఇళ్లు మంజూరైన ప్రజలు సంతోషంగా ఉన్నారు. నేను రెండు గ్రామాలు పరిశీలించగా ఇసుక కొరత ఉందని చెప్పారు. దీంతో కూపన్ల ద్వారా ఇసుక పంపిణీకి ఏర్పాట్లు చేస్తున్నాం. మంజూరైన ఇళ్లు త్వరగా కట్టుకోవాలని అవగాహన కల్పిస్తూనే ఎప్పటికప్పుడు నగదు జమ అయ్యేలా పర్యవేక్షిస్తున్నాం.

● 15 ఎకరాల్లో అవెన్యూ ప్లాంటేషన్

వచ్చేనెల 1వ తేదీ నుంచి వన మహోత్సవం ప్రారంభమవుతుంది. అప్పటిలోగా వర్షాలు జోరందుకుంటాయని భావిస్తున్నాం. 10 – 15 ఎకరాల విస్తీర్ణంలో అవెన్యూ ప్లాంటేషన్ ఏర్పాటుకు నిర్ణయించాం. ఇందుకోసం తిరుమలాయపాలెం, రఘునాథపాలెం మండలాల్లో స్థలాలను గుర్తించాం. అక్కడ మొక్కలు నాటి సంరక్షిస్తూ చిట్టడవిని తలపించేలా తీర్చిదిద్దుతాం. అన్ని ప్రభుత్వ శాఖలను ఇందులో భాగస్వామ్యం చేస్తాం.

● విద్య, వైద్యంపై ప్రత్యేక దృష్టి

జిల్లాలో ప్రధానంగా విద్య, వైద్యంపై దృష్టి పెట్టాం. పాఠశాలలు, కళాశాలలు, వసతిగృహాల మరమ్మతులకు అంచనాలు సిద్ధమవుతున్నాయి పాఠశాలల్లో పారిశుద్ధ్యం బాగుండేలా చూస్తున్నాం. ప్రతీ విద్యార్థికి పౌష్టికాహారం అందిస్తూనే వ్యక్తిగత పరిశుభ్రతపై అవగాహన కల్పిస్తున్నాం. జిల్లా ఆస్పత్రిలో పారిశుద్ధ్య పనులకు కేఎంసీ సిబ్బందిని సమకూర్చాం. రెండు, మూడు రోజుల్లో ఆస్పత్రి కార్మికులకు వేతనాలు అందేలా చూస్తాం.

● వరదలపై అవగాహన కల్పిస్తున్నాం..

గత ఏడాది వచ్చిన వరదను దృష్టిలో పెట్టుకుని ఈసారి కట్టుదిట్టమైన చర్యలు తీసుకుంటున్నాం. మున్నేటికి ఇరువైపులా రిటైనింగ్ వాల్ నిర్మాణాన్ని పరిశీలించడమే కాక వరద ప్రభావిత ప్రాంతాల్లో పర్యటించా. ప్రభావిత ప్రాంతాల్లో ముందస్తుగానే పునరావాస కేంద్రాలను గుర్తిస్తున్నాం. ఎగువ ప్రాంతాల్లో వరదలు మొదలుకాగానే సమాచారం ఇవ్వాలని నీటిపారుదల శాఖ అధికారులకు సూచించాం. అలా సమాచారం రాగానే లోతట్టు ప్రాంతాల ప్రజలను అప్రమత్తం చేస్తాం. అంతేకాక వానాకాలం రెండు నెలలు ఎస్‌డీఆర్‌ఎఫ్ బృందం ఇక్కడే ఉండి ఆపద ఎదురుకాగానే రంగంలోకి దిగనుంది.

తిప్పలు.. తప్పడం లేదు

గ్రౌండ్ రిపోర్ట్

- రేషన్ దుకాణాల వద్ద లబ్ధిదారుల అవస్థలు
- సర్వర్ సమస్యతో బియ్యం పంపిణీలో జాప్యం
- ఇంకొన్ని షాప్‌లకు స్టాక్ చేరక ఎదురుచూపులు

సాక్షిప్రతినిధి, ఖమ్మం: రేషన్ దుకాణాల ద్వారా ఒకేసారి మూడు నెలలకు సంబంధించి సన్న బియ్యం సరఫరా చేస్తున్నారు. ఈ విషయంలో లబ్ధిదారుల్లో ఆనందం వ్యక్తమవుతున్నా.. పంపిణీలో జాప్యం మాత్రం వారిని ఆవేదనకు గురిచేస్తోంది. తొలుత ఆరుసార్లు వేలిముద్రలు వేయాల్సి రావడం, ఆతర్వాత సర్వర్ మొరాయింపు, స్టాక్ లేకపోవడం వంటి కారణాలతో లబ్ధిదారులు ఈనెల 20 వరకు తిప్పలు పడ్డారు. కొన్నిరోజుల పాటు చాలా దుకాణాలు మూసేసి ఉండడం, మరికొన్ని దుకాణాల్లో స్టాక్ లేకపోవడంతో షాప్‌ల చుట్టూ ప్రదక్షిణ చేయాల్సి వచ్చింది. ఈనెల 30 వరకు బియ్యం పంపిణీ చేస్తామని చెబుతున్నా... ఈ-పాస్ యంత్రంలో మాత్రం ఈనెల 29 వరకే సరఫరా జరుగుతుందంటూ డిస్‌ప్లే వస్తుండడం గమనార్హం. ఈనేపథ్యాన జిల్లాలోని పలుచోట్ల రేషన్‌షాప్‌ల్లో 'సాక్షి' పరిశీలించగా అనేక సమస్యలు వెలుగుచూశాయి.



మామిళ్లగూడెంలోని రేషన్‌దుకాణంలో క్యూలైన్‌లో లబ్ధిదారులు

85 శాతం పంపిణీ..

రేషన్ దుకాణాల ద్వారా మంగళవారం సాయంత్రం వరకు 85.22 శాతం లబ్ధిదారులకు బియ్యం పంపిణీ పూర్తయింది. జిల్లాలో మొత్తం 4,15,904 రేషన్‌కార్డులు ఉండగా.. 3,54,466 మంది కార్డుదారులకు బియ్యం అందించారు. అయితే, జిల్లా కేంద్రంలో ఇతర ప్రాంతాల వారు పెద్దసంఖ్యలో స్థిరపడగా వారు పోర్టబులిటీ విధానంలో బియ్యం తీసుకున్నారు. దీంతో చాలా షాపుల్లో స్టాక్ అయిపోయి మిగతా లబ్ధిదారులు ఎదురుచూడాల్సి వస్తోంది. ఈమేరకు డీలర్లు అదనపు స్టాక్ కోసం ఇండెంట్ పంపినా సరఫరాలో జాప్యం జరుగుతోంది. గతంలో ఎన్నడూ లేనట్లు ఒకేసారి మూడు నెలల బియ్యం ఇస్తుండడం.. అదీ సన్నబియ్యం కావడంతో లబ్ధిదారులు దుకాణాల వద్ద బారులు దీరుతున్నారు. ఈనెల 20వరకు ఎక్కడ చూసినా భారీ క్యూలైన్లు కనిపించాయి. జిల్లా కేంద్రంతో పాటు సమీప మండలాల్లో ఇప్పుడూ అదే పరిస్థితి ఉంటోంది. కాగా, కొందరు లబ్ధిదారులు రద్దీ తగ్గాక తీసుకోవాలనే భావనతో వేచిఉండగా ఇప్పుడు వారి సమీపంలోని షాప్‌లు మూతపడడంతో బియ్యం ఎప్పుడొస్తాయని ఆరా తీస్తున్నారు.


■ రెండు రోజుల్లోనే పూర్తి



తాళం వేసిన రేషన్‌షాప్

ముదిగొండ: మండలంలోని గంధసిరిలో ఒక రేషన్ దుకాణం (2241034) పరిధిలో 243 రేషన్ కార్డులు ఉన్నాయి. ఈ షాప్‌నకు 968క్వింటాళ్ల బియ్యం కేటాయించడంతో రెండు రోజుల్లోనే పంపిణీ పూర్తయింది. స్టాక్ ఖాళీ కావడంతో షాప్‌నకు తాళం వేసేశారు. అయితే లబ్ధిదారులకు సరిపడా బియ్యం రాకపోవడంతో ఇతర ప్రాంతాలకు వెళ్లినట్లు తెలిసింది. కార్డుల ఆధారంగా కోటా కేటాయించేలా అధికారుల దృష్టికి తీసుకెళ్లనున్నట్లు డీలర్ వీరబాబు తెలిపారు.

■ కేజీ బియ్యమే నిల్వ




కేజీ స్టాక్ ఉందని రాసిన బోర్డు

కారేపల్లి: కారేపల్లి మండలం సామ్యాతండా గ్రామంలో 516 రేషన్ కార్డులు ఉన్నాయి. ఇప్పటివరకు 337.48 క్వింటాళ్ల బియ్యం పంపిణీ చేశారు. ప్రస్తుతం కేజీ బియ్యం మాత్రమే షాప్‌లో నిల్వ ఉంది. దాదాపు లబ్ధిదారులంతా తీసుకెళ్లినా, ఇంకా ఎవరైనా వస్తే పరిస్థితి ఏమిటన్నది తెలియరావడం లేదు.

■ దఫదఫాలుగా పంపిణీ

ఖమ్మం సహకారనగర్: ఖమ్మం మామిళ్లగూడెంలోని రేషన్‌షాప్(2281037) పరిధిలో 789కార్డులు ఉండగా, నెలనెలా 400క్వింటాళ్ల బియ్యం అవసరవుతాయి. తొలుత అంత మేర బియ్యం కేటాయించగా రెండు, మూడు రోజుల్లో అయిపోయాయి. ఆపై 200 క్వింటాళ్ల బియ్యం కోసం ఇండెంట్ పెట్టగా రాగానే అవి కూడా పంపిణీ చేస్తున్నామని డీలర్ పొన్నం వీణాదేవి తెలిపారు. అయితే, తరచుగా సర్వర్‌లో సమస్యల కారణంగా ఈ-పాస్ మిషన్ మొరాయించడంతో లబ్ధిదారులు ఒకటి, రెండు సార్లు దుకాణానికి వచ్చివెళ్లాల్సిన పరిస్థితి ఎదురైంది.


■ సర్వర్ సతాయించింది..



షాప్‌లో వేలిముద్ర వేస్తున్న మహిళ

సత్తుపల్లి: మూడు నెలలకు సరిపడా ఒకేసారి రేషన్ బియ్యం పంపిణీ క్రమాన సర్వర్ సతాయించడంతో డీలర్లు, లబ్ధిదారులు ఇబ్బంది పడ్డారు. సత్తుపల్లిలోని చింతలపాటి వెంకటేశ్వరరావు రోడ్డులోని సాయికృష్ణ రేషన్‌షాపు పరిధిలో 815 రేషన్‌కార్డులు ఉన్నాయి. పోర్టబులిటీ విధానం అమలులో కొందరు ఇతర ప్రాంతాల్లో, బయటి వారు ఇక్కడ బియ్యం తీసుకుంటున్నారు. మంగళవారం వరకు 70 క్వింటాళ్ల బియ్యం నిల్వ ఉండగా.. ఈ నెలాఖరు వరకు పంపిణీ చేస్తామని డీలర్ తెలిపారు. రోజూ కొద్ది మందే వస్తున్నారని పేర్కొన్నారు.

■ షాప్ ఖాళీ



ఖాళీగా ఉన్న రేషన్‌షాప్

ఖమ్మంరూరల్: ఖమ్మంరూరల్ మండలం జలగంనగర్‌లోని రేషన్ దుకాణాన్ని పరిశీలించగా.. ఇక్కడ 750కార్డులు ఉండగా, లబ్ధిదారులు 95శాతం మేర బియ్యం తీసుకెళ్లారు. జిల్లా కేంద్రాన్ని ఆనుకుని ఉండడంతో ఇతర ప్రాంతాల వారు సైతం పోర్టబులిటీ ద్వారా బియ్యం తీసుకున్నారు. దీంతో స్టాక్ అవసరమని డీలర్ ఇండెంట్ పెట్టారు. కానీ మంగళవారం వరకు స్టాక్ రాకపోవడంతో ఖాళీగా కూర్చోవడం కనిపించింది.

■ మూడు విడతలుగా స్టాక్

రఘునాథపాలెం: రఘునాథపాలెంలోని రేషన్ షాపునకు మూడు విడతలుగా బియ్యం స్టాక్ వచ్చింది. ప్రతీ స్టాక్ అయిపోతుండడం, లబ్ధిదారులు తిరుగుతుండడంతో తిరిగి బియ్యం తెప్పించి పంపిణీ చేశారు. దీంతో కొద్దిరోజులు వేచి ఉండాల్సిన పరిస్థితులు నెలకొన్నాయి. ఒకేసారి మూడు నెలలకు సరిపడా బియ్యం వచ్చినా షాప్‌లో నిల్వ చేసే పరిస్థితి లేక ఈ సమస్య ఎదురైంది.


బియ్యం ఉన్నాయని తెలిసి వచ్చా



ఇంతకు ముందు ఒకసారి రేషన్‌షాపునకు వస్తే బియ్యం స్టాక్ లేవని చెప్పారు. ఇప్పుడు బియ్యం వచ్చాయని తెలిసిన వారు చెప్పడంతో వచ్చాను. గతంలో కొన్నాళ్లు అనారోగ్య కారణాలతో బియ్యం తీసుకోలేదు. కానీ ఇప్పుడు తీసుకుంటున్నా.

– మద్దాల సక్కుబాయి, రఘునాథపాలెం

అందరూ తీసుకెళ్తున్నారు...



గతంలో దొడ్డుబియ్యం చాలా మంది తీసుకునేవారు కాదు. కానీ ఇప్పుడు సన్నబియ్యం ఇస్తుండడం, ఒకేసారి మూడు నెలల కోటా విడుదల చేయడంతో చాలా మంది వచ్చారు. తొలుత ఇబ్బందులు ఎదురైనా క్యూలో నిలబడి బియ్యం తీసుకెళ్లారు.

– వాంకుడోతు దశ్‌సింగ్, డీలర్, సామ్యాతండా

రెండు రోజులుగా తిరుగుతున్నా...



మూడు నెలల బియ్యం ఇస్తున్నారని తెలిసి సోమవారం వచ్చాను. రాత్రి వరకు ఉంటే ఆన్‌లైన్ పనిచేయలేదు. దీంతో మంగళవారం ఉదయమే వచ్చాను. చాలా మంది ఉండడంతో ఆలస్యమైనా క్యూలో నిల్చుని బియ్యం తీసుకెళ్తున్నా.

– గుర్రం సంధ్యారాణి, ఖమ్మం

రైతు భరోసా సంపూర్ణం

- తొమ్మిది రోజుల్లో పెట్టుబడి సాయం జమ
- జిల్లాలో 3.53లక్షల మంది రైతులకు రూ.436.84 కోట్లు
- రైతువేదికల్లో సీఎం ప్రసంగాన్ని వీక్షించిన అన్నదాతలు

ఖమ్మంవ్యవసాయం: పంటల సాగుకు పెట్టుబడి సాయంగా ప్రభుత్వం అమలుచేస్తున్న రైతుభరోసా పథకం ద్వారా జిల్లాలో అర్హులైన రైతులకు నగదు జమ అయింది. ఈనెల 16న ఎకరాకు రూ.6వేల నగదు జమ చేయడం మొదలుపెట్టగా తొమ్మిది రోజుల్లో మంగళవారం నాటికి పూర్తయింది. జిల్లాలో రైతు భరోసా పథకానికి 3,53,794 మంది రైతులను అర్హులుగా గుర్తించిన ప్రభుత్వం, వారికి ఉన్న సాగు భూమి ఆధారంగా రూ.436,84,65,365 కోట్లను కేటాయించింది. సోమవారం నాటికి 15ఎకరాల వరకు భూమి కలిగిన 3,31,397 మంది ఖాతాల్లో రూ.406,36,62,570 జమ చేసిన ప్రభుత్వం మిగిలిన 22,397మంది రైతుల ఖాతాల్లో రూ.30,48,02,795 నగదును మంగళవారం జమ చేసింది.

రైతు వేదికల ద్వారా విజయోత్సవాలు

రాష్ట్ర ప్రభుత్వం రైతు భరోసా పథకం ద్వారా పెట్టుబడి సాయం జమ చేసిన సందర్భంగా మంగళవారం రైతు వేదికల ద్వారా విజయోత్సవ వేడుకలు నిర్వహించింది. హైదరాబాద్‌లో ఏర్పాటుచేసిన కార్యక్రమంలో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, మంత్రులు పాల్గొనగా.. వీడియో కాన్ఫరెన్స్ ద్వారా రైతువేదికల్లో వీక్షణకు ఏర్పాట్లు చేశారు. ఈ సందర్భంగా జిల్లాలోని రైతు వేదికల ద్వారా రైతులు, వ్యవసాయ, ఇతర శాఖల అధికారులు పాల్గొన్నారు. కూసుమంచిలోని రైతు వేదికలో కలెక్టర్ అనుదప్ దురిశెట్టి, జిల్లా వ్యవసాయాధికారి ధనసరి పుల్లయ్య తదితరులు పాల్గొన్నారు. మరోపక్క కాంగ్రెస్ ఆధ్వర్యాన గ్రామాల్లో సీఎం, మంత్రుల చిత్రపటాలకు పాలాభిషేకం చేసి సంబురాలు జరుపుకున్నారు.



కూసుమంచి : రైతువేదికలో మాట్లాడుతున్న కలెక్టర్ అనుదీప్, పక్కన డీఏఓ పుల్లయ్య, తదితరులు



ఖమ్మంరూరల్: పల్లెగూడెంలో సీఎం, మంత్రి పొంగులేటి చిత్రపటాలకు పాలాభిషేకం..

విత్తనాలు, ఎరువులు సిద్ధం

కూసుమంచి: వానాకాలం సీజన్ ప్రారంభమైన నేపథ్యాన జిల్లా రైతులకు సరిపడా విత్తనాలు, ఎరువులను సిద్ధంగా ఉంచామని కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి తెలిపారు. కూసుమంచిలోని రైతు వేదికలో రైతు భరోసా సంబురాలకు హాజరైన ఆయన మాట్లాడుతూ జిల్లాలో 3.53లక్షల మందికి రైతులకు పెట్టుబడి సాయంగా రూ.430 కోట్ల మేర జమ అయ్యాయని చెప్పారు. ఎక్కడ కూడా ఎరువులు, విత్తనాలు కొరత లేకుండా పర్యవేక్షిస్తున్నామని, ఎక్కడైనా సమస్య ఎదురైతే అధికారుల దృష్టికి తీసుకురావాలని సూచించారు. అలాగే, రైతులు ఉద్యాన పంటల సాగుపై దృష్టి సారించాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆత్మ కమిటీ చైర్మన్ చావా శివరామకృష్ణ, జిల్లా వ్యవసాయాధికారి డి.పుల్లయ్య, సెరికల్చర్ అధికారి ముత్యాలు, ఏడీఏ సరిత, ఏఓలు, ఏఈఓలు పాల్గొన్నారు.

రిటైనింగ్ వాల్ పనుల్లో వేగం

- భూనిర్వాసితులతో చర్చలు జరపాలి
- పనులు పరిశీలించిన కలెక్టర్ అనుదీప్

ఖమ్మం అర్బన్/ఖమ్మం రూరల్: మున్నేరు నదికి ఇరువైపులా చేపట్టిన రిటైనింగ్ వాల్ నిర్మాణ పనుల్లో మరింత వేగం పెంచాలని కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి ఆదేశించారు. అదనపు కలెక్టర్ పి.శ్రీనివాసరెడ్డితో కలిసి మంగళవారం ఆయన ఖమ్మం అర్బన్, రూరల్ మండలాల్లో రిటైనింగ్ వాల్ పనులను పరిశీలించారు. అలాగే, పోలేపల్లి వద్ద భూనిర్వాసితులకు కేటాయించనున్న ప్రభుత్వ భూమిని పరిశీలించి మాట్లాడారు. మున్నేటికి ఇరువైపులా 17 కి.మీ. మేర రిటైనింగ్ వాల్ నిర్మాణానికి 138 ఎకరాల భూమి అవసరమని తెలిపారు. ప్రభుత్వ, అభ్యంతరం లేని ప్రాంతాల్లో పనులు జరుగుతుండగా, మిగతాచోట్ల భూసేకరణకు నిర్వాసితులతో చర్చించాలని సూచించారు. నిర్వాసితులకు పోలేపల్లిలోని 300ఎకరాల ప్రభుత్వ భూమిని అభివృద్ధి చేసి ఇవ్వనున్న విషయమై అవగాహన కల్పించాలని తెలిపారు. వర్షాలు మొదలైనందున ఎగువ ప్రాంతంలో వరదలపై ఎప్పటికప్పుడు సమీక్షించాలని కలెక్టర్ సూచించారు. అలాగే, వరద పెరిగితే ప్రభావిత ప్రాంత ప్రజలను తరలించేందుకు ఏర్పాట్లు చేయాలని తెలిపారు. జలవనరుల శాఖ ఎస్‌ఈ ఎం.వెంకటేశ్వర్లు, ఈఈ అనన్య, ఆర్డీవో నర్సింహారావు, పాలేరు ప్రత్యేకాధికారి రమేష్, తహసీల్దార్లు సైదులు, పి.రాంప్రసాద్, ఇరిగేషన్ డీఈ రమేష్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

నాటే ప్రతీ మొక్కకు జియో టాగింగ్

ఖమ్మంవ్యవసాయం: వన మహోత్సవంలో భాగంగా బ్లాక్ ప్లాంటేషన్‌లో పెద్ద ఎత్తున మొక్కలు నాటేలా ఏర్పాట్లు చేస్తున్నామని కలెక్టర్ అనుదీప్ తెలిపారు. హైదరాబాద్ నుంచి రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కె.రామకృష్ణారావు పలు పథకాలపై కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్షించారు. ఈ సందర్భంగా సీఎస్ మాట్లాడుతూ భారీ వర్షాలు కురవడానికి ముందే ఇందిరమ్మ ఇళ్ల గ్రౌండింగ్, బేస్‌మెంట్ వరకు నిర్మాణం పూర్తయ్యేలా పర్యవేక్షించాలని తెలిపారు. డబుల్ బెడ్ రూమ్ ఇళ్లలో పెండింగ్ పనులు పూర్తిచేయాలని, సరిపడా ఎరువులు సమకూర్చుకోవడమే కాక ఆయిల్ పామ్ సాగు పెరిగే రైతులకు అవగాహన కల్పించాలని సూచించారు. అంతేకాక డెంగీ, మలేరియా, చికున్‌గున్యా ప్రబలకుండా శ్రద్ధ వహించాలని తెలిపారు. జిల్లా నుంచి కలెక్టర్ అనుదీప్ వివరాలు వెల్లడించారు. ఆతర్వాత అధికారులతో సమావేశమై సూచనలు చేశారు. వనమహోత్సవంలో నాటే ప్రతీ మొక్కకు జియో టాగింగ్ చేయాలని, గుంతల తవ్వకం ఉపాధి హామీ కూలీలతో చేయించాలని తెలిపారు. అలాగే, పలు అంశాలపై సూచనలు చేశారు. అదనపు కలెక్టర్లు డాక్టర్ పి.శ్రీజ, పి.శ్రీనివాసరెడ్డి, డీఎఫ్‌ఓ సిద్దార్థ్ విక్రమ్‌సింగ్, జెడ్పీ సీఈఓ దీక్షారైనాతో పాటు వివిధ శాఖల అధికారులు సన్యాసయ్య, ఆశాలత, కళావతిబాయి, పుల్లయ్య, శ్రీనివాస్, రాజశేఖర్, రాంబాబు, నర్సింహారావు, రాజేందర్‌గౌడ్, అనిత పాల్గొన్నారు.

క్లుప్తంగా

పెద్దాస్పత్రిలో లీకేజీలు



ల్యాబ్‌లో చేరిన లీకేజీ నీరు

ఖమ్మంవైద్యవిభాగం: జిల్లా కేంద్రంలోని పెద్దాస్పత్రిలో పలుచోట్ల పైపుల నుండి నీరు లీక్ అవుతోంది. వేతనాలు చెల్లించకపోవడంతో పారిశుద్ధ్య కార్మికులు ఎనిమిది రోజులుగా సమ్మె చేస్తున్నారు. దీంతో డ్రెయినేజీ వ్యవస్థ అస్తవ్యస్తంగా మారింది. పైపుల్లో చెత్తాచెదారం పేరుకుపోయి పలు వార్డుల్లో నీరు లీకేజీ అవుతోంది.

కేవీకే కోఆర్డినేటర్ రవికుమార్ బదిలీ

- వ్యవసాయ కళాశాల ప్రొఫెసర్‌గా నియామకం



రవికుమార్

వైరా: ఖమ్మం జిల్లా వైరాలోని కృషి విజ్ఞాన కేంద్రం (కేవీకే) కోఆర్డినేటర్ డాక్టర్ కె. రవికుమార్ బదిలీ అయ్యారు. ఆయనను భద్రాద్రి జిల్లా అశ్వారావుపేట వ్యవసాయ కళాశాల ప్రొఫెసర్‌గా నియమించారు. అయితే, రవికుమార్ స్థానంలో కేవీకే కోఆర్డినేటర్‌గా ఎవరినీ నియమించలేదు. కేవీకేలో సీనియర్ శాస్త్రవేత్తకు ఇన్‌చార్జ్ బాధ్యతలు అప్పగించనున్నట్లు సమాచారం.

ఎస్‌బీఐ ఆధ్వర్యాన రక్తదానం



సర్టిఫికెట్లు అందిస్తున్న అధికారులు

ఖమ్మంగాంధీచౌక్: స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా(ఎస్‌బీఐ) 70వ వ్యవస్థాపక వేడుకల్లో భాగంగా మంగళవారం ఖమ్మం మమత కాలేజ్ రోడ్డు బ్రాంచ్‌లో రక్తదాన శిబిరం ఏర్పాటుచేశారు. ఈ సందర్భంగా 123 మంది ఎస్‌బీఐ ఉద్యోగులు రక్తదానం చేశారు. ఈ కార్యక్రమాన్ని ప్రారంభించిన బ్యాంక్ రీజినల్ మేనేజర్ బి.రాజేఖర్ మాట్లాడుతూ ప్రమాదకర పరిస్థితిలో ఉన్న వారిని ఆదుకోవడంలో రక్తదానం కీలకంగా నిలుస్తుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఏజీఎం మోహన్‌నాయక్, బ్యాంక్ ఆఫీసర్ల అసోసియేషన్ ఏజీఎస్ షేక్ ఇబ్రహీం, రీజనల్ సెక్రటరీ ఆర్.శివకుమార్, హెచ్‌ఆర్ మేనేజర్ ఉదయ్, స్టాఫ్ యూనియన్ వైస్ ప్రెసిడెంట్ నందన్, రీజనల్ సెక్రటరీ చిన్నపరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

గొర్రెలు, గుర్రాల చోరీకి యత్నం

ముదిగొండ: మహబూబ్‌నగర్‌నుంచిమేత కోసం జీవాలను తీసుకురాగా, వాటిని చోరీ చేసేం దుకు దుండగులు యత్నించిన ఘటన ఇది. వివరాలిలా ఉన్నాయి. మహబూబ్‌నగర్ జిల్లాకు చెందిన పెంపకందారులు మేత కోసం తీసుకురాగా, మండలంలోని బాణాపురంలో ఓ రైతు పొలంలో సోమవారం రాత్రి నిద్రించారు. ఈక్రమాన టాటా ఏస్ వాహనంలో వచ్చిన నలుగురు వ్యక్తులు పెంపకందారుల వెంట ఉన్న రెండుగుర్రాలతో పాటు గొర్రెల చోరీకి యత్నించారు. గొర్రెల కాళ్లకు తాళ్లు కట్టి వాహనంలోకి ఎక్కించడానికి ప్రయత్నిస్తుండగా కాపలాదారులు నిద్రలేచారు. దీంతో కేకలు వేయడంతో దుండగులు పరారయ్యారు. ఆపై టాటా ఏస్ వాహనాన్ని కాపలాదారులు ద్విచక్ర వాహనంపై వెంబడించి వల్లభి వద్ద అడ్డుకున్నారు. దీంతో డ్రైవర్ వాహనాన్ని వదిలేసి పరారు కాగా మంగళవారం పోలీసులు వాహనాన్ని స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేశారు.

విద్యుదాఘాతంతో పాడిగేదెలు మృతి

కారేపల్లి: తెగి పడిన విద్యుత్ తీగలను తాకడంతో రెండు పాడిగేదెలు మృత్యువాత పడ్డాయి. కారేపల్లికి చెందిన రైతు ఇమ్మడి సీతారాములు తన రెండు పాడిగేదెలను సోమవారం మేతకు వదలగా సుబ్బయ్యకుంట చెరువు సమీపానికి వెళ్లాయి. అయితే, రాత్రి గేదెలు రాకపోవటంతో రైతు కుటుంబం ఎక్కడ వెతికినా ఆచూకీ లభించలేదు. అయితే, సుబ్బయ్యకుంటకు కాస్త దూరాన విద్యుత్ తీగలు తెగిపడి ఉండటం, వీటిని తాకిన పాడిగేదెలు మృతి చెందినట్లు మంగళవారం గుర్తించిన స్థానికులు సీతారాములుకు సమాచారం ఇచ్చారు. రెండు రోజుల క్రితం గాలివానకు తీగలు తెగిపడి ఉంటాయని, మేతకు వెళ్లిన గేదెలు వాటిని తాకి మృత్యువాత పడ్డాయని భావిస్తున్నారు.

వైన్స్ వద్ద ఘర్షణ, కత్తిపోట్లు

ఖమ్మంఅర్బన్: వైన్స్ వద్ద మందుబాబుల మధ్య జరిగిన ఘర్షణ కత్తిపోట్లకు దారి తీసింది. ఖమ్మం విజయ డెయిరీ ఎదురుగా ఉన్న వైన్స్ వద్ద ఇందిరానగర్‌కు చెందిన మనీశ్ వైన్స్ వద్ద మద్యం సేవిస్తూ పలువురితో అసభ్యంగా ప్రవర్తించినట్లు తెలిసింది. దీంతో టేకులపల్లి లక్ష్మీనగర్‌కు చెందిన మేదరాజుల వెంకటేశ్వర్లు ఇదేమిటని ప్రశ్నించగా వాగ్వాదం తలెత్తినట్లు సమాచారం. ఈక్రమంలోనే మనీష్‌కు ఆయన స్నేహితులు తోడై వెంకటేశ్వర్లుపై దాడి చేశారు. ఆపై వెంకటేశ్వర్లు ఇంటికి వెళ్లి కత్తి తీసుకొచ్చి మనీష్‌పై దాడి చేయగా ఆయన మెడపై తీవ్ర గాయం కావడంతో ఆస్పత్రికి తరలించారు. ఆతర్వాత వెంకటేశ్వర్లు పోలీస్‌స్టేషన్‌కు వెళ్లి లొంగిపోయినట్లు సమాచారం. కాగా, ఈ గొడవతో ఆ ప్రాంతంలో వాహనదారులు ఆందోళనకు గురయ్యారు.

సులువుగా కాపాడేలా..

- అగ్నిమాపకశాఖకు రెండు రెస్క్యూ బోట్లు
- శిక్షణ పొందుతున్న ఉద్యోగులు



సామగ్రి తరలింపునకు కేటాయించిన వాహనం



బోట్‌పై మున్నేరులో శిక్షణ తీసుకుంటున్న ఉద్యోగులు

ఖమ్మంక్రైం: గత ఏడాది మున్నేటికి అనూహ్యంగా వచ్చిన వరద ఖమ్మం కార్పొరేషన్‌తో పాటు ఖమ్మం రూరల్ మండలాల్లోని పలు కాలనీల ప్రజలకు తీరని నష్టాన్ని మిగిల్చింది. అప్పట్లో ఒక్కసారిగా వరద ముంచెత్తడంతో సహాయక చర్యలు చేపట్టడానికి బోట్లు, ఇతర సామగ్రి లేక యంత్రాంగానికి ఇక్కట్లు ఎదురయ్యాయి. ఈనేపథ్యాన ఈసారి వర్షాకాలంలో ఎలాంటి ఇబ్బందులు ఎదురుకాకుండా అధికారులు ముందస్తు చర్యల్లో నిమగ్నమయ్యారు. వరద ముంచెత్తితే ప్రభావిత ప్రాంతాల ప్రజలను సురక్షితంగా బయటకు తీసుకొచ్చేలా రాష్ట్ర అగ్నిమాపక శాఖ జిల్లాకు రెండు ప్రత్యేక రెస్క్యూ బోట్లను కేటాయించింది.

జిల్లాకు రెండు ఐఆర్‌బీ బోట్లు...

గత ఏడాది పరిస్థితుల దృష్ట్యా జిల్లా అగ్నిమాపక శాఖకు ఉన్నతాధికారులు రెండు ఐఆర్‌బీ(ఇన్‌ఫ్లేటబుల్ రెస్క్యూ బోట్లు)లను సమకూర్చారు. ప్రత్యేకంగా తయారు చేసిన ఈ బోట్ల ద్వారా నదులు, చెరువులు ఉధృతంగా ప్రవహిస్తున్నా అందులో చిక్కుకున్న వారిని సులువుగా తీసుకురావడం సాధ్యమవుతుందని చెబుతున్నారు. ఒక్కో బోట్‌లో ప్రత్యేకంగా శిక్షణ పొందిన సిబ్బంది వెళ్లి ఆరుగురిని సురక్షితంగా ఒడ్డుకు తీసుకొచ్చే అవకాశముంది. అంతేకాక బోట్లు, ఇతర సామగ్రిని వరద ప్రభావిత ప్రాంతాలకు చేర్చేలా ఒక వాహనాన్ని సైతం అగ్నిమాపక శాఖ కేటాయించింది.

ఉద్యోగులకు శిక్షణ

బోట్ల నిర్వహణ, వరదల్లో చిక్కుకున్న వారిని రక్షించి తీసుకురావంతో ఇటీవల హైదరాబాద్‌లోని ఎన్డీఆర్‌ఎఫ్ కేంద్రంలో అగ్నిమాపక శాఖ సిబ్బంది పలువురికి విడతల వారీగా శిక్షణ ఇచ్చారు. అంతేకాక స్థానిక పరిస్థితులు అవగాహన వచ్చేలా ఖమ్మంలోని మున్నేరుతోపాటు లకారం తదితర పెద్ద చెరువుల్లో బోట్ల ద్వారా శిక్షణ పొందుతున్నారు.

మరిన్ని బోట్ల కోసం ప్రతిపాదించాం..

గత ఏడాది మున్నేరుకు వచ్చిన వరదల దృష్ట్యా జిల్లాకు ప్రత్యేక బోట్లు కావాలని కోరడంతో అగ్నిమాపకశాఖ అడిషనల్ డీజీ సాగిరెడ్డి రెండు ప్రత్యేక బోట్లు కేటాయించారు. అయితే, జిల్లాకు మరిన్ని బోట్లు కావాలని కోరగా సానుకూలంగా స్పందించారు. వీటి ద్వారా వరదల్లో చిక్కుకున్న వారిని రక్షించడంపై ఉద్యోగులకు శిక్షణ కొనసాగుతోంది.

– అజయ్, జిల్లా అగ్నిమాపకశాఖ అధికారి

మాదక ద్రవ్యాల నిర్మూలన అందరి బాధ్యత

ఖమ్మంక్రైం/ఖమ్మం అర్బన్: మాదక ద్రవ్యాల నిర్మూలనను అందరూ బాధ్యతగా భావించాలని అడిషనల్ డీసీపీ ప్రసాద్‌రావు సూచించారు. మాద క ద్రవ్యాల దుర్వినియోగం, అక్రమ రవాణాకు వ్యతిరేకంగా ఖమ్మంలోని ఎస్ఆర్ కళాశాల, ఇంది రానగర్ ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు మంగళవారం స్లోగన్ రైటింగ్ పోటీలు నిర్వహించారు. ఈ సందర్భంగా విజేతలకు బహుమతులు అందజేయడంతో పాటు వారితో ప్రతిజ్ఞ చేయించాక అడిషనల్ డీసీపీ మాట్లాడారు. మత్తు పదార్థాలకు అలవాటు పడితే జీవితంలో సర్వం కోల్పోయినట్లేనని తెలిపా రు. ఈ విషయంలో విద్యార్థులు అప్రమత్తంగా ఉంటూ ఇతరులకు అవగాహన కల్పించాలని సూచించారు. టీజీఎన్‌బీ డీఎస్పీ శ్రీధర్, సీఐలు విజయ్, భానుప్రకాష్ పాల్గొన్నారు. అలాగే, ట్రాఫిక్ పోలీసు ల ఆధ్వర్యాన న్యూవిజన్ కళాశాలలో అవగాహన సదస్సు నిర్వహించారు. ట్రాఫిక్ ఏసీపీ శ్రీనివాసులు, సీఐ సత్యనారాయణ ఆర్ఐ సాంబశివరావు, ఎస్ఐలు రవి, సాగర్ తదితరులు పాల్గొన్నారు.



ప్రతిజ్ఞ చేయిస్తున్న అడిషనల్ డీసీపీ ప్రసాద్‌రావు

ప్రైవేట్ పాఠశాల గోదాం సీజ్



పుస్తకాల గోదాంను సీజ్‌చేస్తున్న ఎంఈఓ రాజేశ్వరరావు

సత్తుపల్లి: సత్తుపల్లిలోని నారాయణ స్కూల్‌లో అనుమతి లేకుండా పుస్తకాలు విక్రయిస్తున్నారనే సమాచారంతో ఎంఈఓ నక్కా రాజేశ్వరరావు మంగళవారం తనిఖీలు చేపట్టారు. ఈ విషయమై తొలుత ఏఐఎస్ఎఫ్ నాయకులు పాఠశాల ఎదుట ధర్నా చేశారు. దీంతో సమాచారం అందుకున్న ఎంఈఓ తనిఖీలు చేపట్టి పుస్తకాలు విక్రయిస్తున్నట్లు నిర్ధారించి గోదాంను సీజ్ చేశారు. ఈమేరకు ఎంఈఓ రాజేశ్వరరావు మాట్లాడుతూ నారాయణ స్కూల్‌తో సహా మరికొన్ని విద్యాసంస్థల్లో నిబంధనలకు విరుద్ధంగా పుస్తకాలు విక్రయిస్తున్నట్లు సమాచారం ఉందని తెలిపారు. నారాయణ స్కూల్‌పై ఫిర్యాదు అందడంతో గోదాంను సీజ్ చేసి డీఈఓకు నివేదిక ఇచ్చామని చెప్పారు. నిబంధనలకు విరుద్ధంగా పుస్తకాలు, టై, బెల్ట్‌లు, షూలు విక్రయిస్తున్నారని తెలిపారు. కాగా, ఏఐఎస్ఎఫ్ జిల్లా అధ్యక్షుడు మడుపల్లి లక్ష్మణ్ మాట్లాడుతూ పాఠశాలల్లో పుస్తకాలు, యూనిఫామ్ అమ్మకుండా అధికారులు పర్యవేక్షించాలని డిమాండ్ చేశారు. ఈ ఆందోళనలో శివనాయక్, వంశీ, మనోజ్, అన్నవరపు ఉపేంద్ర, రామకృష్ణ, దేవేందర్, రామ్‌చరణ్ పాల్గొన్నారు. అయితే, సత్తుపల్లిలోని పలు పాఠశాలల్లో నోట్‌పుస్తకాలు, పాఠ్యపుస్తకాలు, యూనిఫామ్, టైలు, బెల్ట్‌లు, షూ అధిక ధరలకు విక్రయిస్తున్నా అధికారులు పట్టించుకోకపోవడంపై విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. విద్యార్థి సంఘాల నాయకులు ఆందోళన చేస్తేనే తనిఖీలు చేపట్టడం, మిగతా స్కూళ్లపై దృష్టి సారించకపోవడం ఏమిటని ప్రశ్నిస్తున్నారు. అలాగే, పాఠశాలల తీరుతో తాము ఉపాధి కోల్పోతున్నామని దుకాణాల యజమానులు వాపోతున్నారు.

లైంగిక వేధింపులపై కేసు నమోదు

చింతకాని: మండలంలోని నాగులవంచ రైల్వే కాలనీ గ్రామానికి చెందిన కొంపెల్లి శేషగిరిరావుపై పోలీసులు మంగళవారం కేసు నమోదు చేశారు. ఆయన అదే గ్రామానికి చెందిన వివాహితను కొంతకాలం నుంచి లైంగికంగా వేధిస్తున్నాడు. దీంతో బాధితురాలి ఫిర్యాదుతో కేసు నమోదు చేసినట్లు ఎస్సై నాగుల్‌మీరా తెలిపారు.

చెల్లని చెక్కు కేసులో ఆరు నెలల జైలుశిక్ష

ఖమ్మం లీగల్: అప్పు చెల్లించే క్రమాన ఇచ్చిన చెక్కు చెల్లకపోవడంతో ముదిగొండ మండలం బాణాపురానికి చెందిన మహ్మద్ జానీమియాకు ఆరు నెలల జైలుశిక్ష విధిస్తూ ఖమ్మం రెండో అదనపు ప్రథమ శ్రేణి కోర్టు న్యాయాధికారి ఏపూరి బిందుప్రియ ముంగళవారం తీర్పు చెప్పారు. ముదిగొండ మండలం పెద్దమండవకు తాళ్లూరి శీతయ్య వద్ద జానీమియా 2018 ఆగస్టులో రూ.2లక్షల అప్పు తీసుకున్నాడు. తిరిగి చెల్లించే క్రమాన 2021 మార్చి 10న రూ.2.24 లక్షలకు చెక్కు జారీ చేశాడు. అయితే, చెక్కును బ్యాంక్‌లో జమ చేస్తే జానీమియా ఖాతా మూసివేసినట్లు అధికారులు వెల్లడించారు. దీంతో న్యాయవాది ద్వారా లీగల్ నోటీస్ జారీ చేసిన శీతయ్య కోర్టులో ప్రైవేట్ కేసు దాఖలు చేశాడు. విచారణ అనంతరం జానీమియాకు ఆరు నెలల జైలుశిక్షతో పాటు ఫిర్యాదికి రూ.2.24క్షలు చెల్లించాలని న్యాయాధికారి తీర్పు చెప్పారు. అయితే, ఆయనకు మరో కేసులో కూడా ఆరు నెలలు జైలుశిక్ష, ఫిర్యాదికి రూ.లక్ష చెల్లించాలని తీర్పు వెలువడింది.

ఆర్‌అండ్‌బీ స్థలం ఆక్రమణపై కేసు నమోదు

వైరారూరల్: మండలంలోని రెబ్బవరంలో ఆర్‌అండ్‌బీ స్థలం ఆక్రమణదారులపై పోలీసులు కేసు నమోదు చేశారు. రెబ్బవరం గ్రామానికి చెందిన మక్కల శివాణి గత ఏడాది అక్టోబర్‌లో అర్‌అండ్‌బీ స్థలంలో ఉన్న ఆర్టీసీ బస్ షెల్టర్‌ను జేసీబీతో కూల్చివేయించింది. ఆ తర్వాత అర్‌అండ్‌బీ అధికారులు ప్రభుత్వ స్థలమని బోర్డు ఏర్పాటు చేసినా, శివాణి ఆ బోర్డును తొలగించి స్థలాన్ని ఆక్రమించుకుంది. దీంతో ఆర్‌అండ్‌బీ అధికారుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్సై పి.రామారావు తెలిపారు.

ఆర్టీసీ డ్రైవర్‌పై దాడి ఘటనలో...

విధినిర్వహణలో ఉన్న ఆర్టీసీ డ్రైవర్‌పై దాడికి పాల్పడిన వ్యక్తిపై కేసు నమోదైంది. కొత్తగూడెం డిపో బస్సు ఖమ్మం నుండి కొత్తగూడెం వెళ్తుండగా డ్రైవర్ శ్రీనివాసరావు ముందు ఉన్న లారీని ఓవర్‌టేక్ చేసే క్రమంలో తల్లాడ వైపు నుండి ఎదురుగా ద్విచక్ర వాహనదారుడు చింతమల గాంధీ వచ్చాడు. ఈక్రమంలో ఆయన ఆర్టీసీ డ్రైవర్‌తో వాగ్వాదానికి దిగి దాడి చేశాడు. దీంతో డ్రైవర్ ఫిర్యాదు మేరకు గాంధీపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.

మున్సిపాలిటీల్లో పదోన్నతులు, బదిలీలు

- కేఎంసీ ఏఎంసీగా అనిల్‌కుమార్
- మధిర, వైరా కమిషనర్లకు పూర్తిస్థాయి పోస్టింగ్



ఖమ్మం కార్పొరేషన్ ఏఎంసీ అనిల్‌కుమార్

ఖమ్మంమయూరిసెంటర్: మున్సిపాలిటీలు, కార్పొరేషన్లలో పలువురు ఉద్యోగులను బదిలీచేస్తూ ప్రభుత్వం మంగళవారం ఉత్తర్వులు జారీ చేసింది. ఖమ్మం నగరపాలక సంస్థ అసిస్టెంట్ కమిషనర్ అహ్మద్ షఫీ ఉల్లాను జీహెచ్ఎంసీ డిప్యూటీ కమిషనర్‌గా బదిలీ చేశారు. అలాగే, గ్రేటర్ వరంగల్ మున్సిపల్ కార్పొరేషన్ సూపరింటెండెంట్ జె. అనిల్‌కుమార్‌కు పదోన్నతి కల్పించి కేఎంసీ అసిస్టెంట్ కమిషనర్‌గా నియమించారు. అంతేకాకుండా మధిర, వైరా కమిషనర్లుగా విధులు నిర్వర్తిస్తున్న ఏ.సంపత్‌కుమార్, సీహెచ్.వేణును అక్కడే పూర్తిస్థాయి కమిషనర్లుగా పోస్టింగ్ ఇచ్చారు. గ్రేడ్–3 కమిషనర్‌గా పదోన్నతి పొందిన బి.నాగరాజును భద్రాద్రి కొత్తగూడెం జిల్లా అశ్వారావుపేట కమిషనర్‌గా నియమించారు. అంతేకాక పలు మున్సిపాలిటీల్లో జూనియర్ అసిస్టెంట్లకు పదోన్నతి కల్పించి పోస్టింగ్ ఇచ్చారు. కొత్తగూడెంలో పనిచేస్తున్న జె.సుజితకు కేఎంసీలో సీనియర్ అసిస్టెంట్‌గా, ఇల్లెందులో పనిచేస్తున్న బి.సుధీర్‌కు వైరాలో, కేఎంసీలో పనిచేస్తున్న డి.నాగరాజుకు కొత్తగూడెం కార్పొరేషన్‌లో, సత్తుపల్లిలో పనిచేస్తున్న బి.రామచంద్రుకు కేఎంసీలో పోస్టింగ్ ఇస్తూ ఉత్తర్వులు విడుదలయ్యాయి. అలాగే, ఇల్లెందులో పనిచేస్తున్న ఎం.వీరకుమారి, మధిరలో పనిచేస్తున్న ఆర్.నాగలక్ష్మి, కొత్తగూడెంలో పనిచేస్తున్న మూడ్ అశోక్, పి.సరస్వతికి పాత కేంద్రాల్లోనే పోస్టింగ్ ఇవ్వగా, మహబూబాబాద్‌లో విధులు నిర్వర్తిస్తున్న కే.పీ.దిలీప్‌కుమార్‌ను సత్తుపల్లి సీనియర్ అసిస్టెంట్‌గా నియమించారు.

కలెక్టర్‌ను కలిసిన డీఎఫ్‌ఓ సిద్ధార్థ్

ఖమ్మంవ్యవసాయం: కలెక్టర్‌గా ఇటీవల బాధ్యతలు స్వీకరించిన అనుదీప్ దురిశెట్టిని జిల్లా అటవీ అధికారి(డీఎఫ్‌ఓ) సిద్ధార్థ్ విక్రమ్‌సింగ్ మంగళవారం కలిశా రు. కలెక్టరేట్‌లో మంగళవారం ఆయనను మర్యాదపూర్వకంగా కలిసిన డీఎఫ్‌ఓ మొక్క అందజేసి శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం అటవీ సంబంధిత వ్యవహారాలపై చర్చించారు.



కలెక్టర్ అనుదీప్‌కు మొక్క అందిస్తున్న డీఎఫ్‌ఓ

గంజాయి రవాణాలో యువతులు

- ఖమ్మం కొత్త బస్టాండ్‌లో పట్టుబడిన నిందితులు



నిందితులు, గంజాయితో ఎక్సైజ్ పోలీసులు

ఖమ్మంక్రైం: పోలీసులు, ప్రయాణికులకు అనుమానం రాకుండా అమ్మాయిలతో కొందరు అక్రమార్కులు గంజాయి రవాణా చేయిస్తునట్లు తేలింది. గంజాయి రవాణా సమాచారంతో ఎక్సైజ్ ఏఈఎస్ తిరుపతి ఆధ్వర్యాన మంగళవారం ఖమ్మం కొత్త బస్టాండ్‌లో తనిఖీలు చేపట్టారు. ఈ సందర్భంగా ఒక యువకుడు, ఇద్దరు యువతులు అనుమానాస్పదంగా కనిపించడంతో వారి బ్యాగ్‌ల్లో పరిశీ లించగా రూ.2.50లక్షల విలువైన గంజాయి బయటపడింది. ఒడిశా నుంచి గంజాయితో బయలుదేరిన వారు బస్సులు మారుకుంటూ ఖమ్మం చేరుకుని, బెంగళూరుకు వెళ్లడానికి సిద్ధమైనట్లు గుర్తించారు. నిందితులు ఒడిశాలోని మల్కాన్‌గిరి జిల్లాకు చెందిన శుభకర్‌మండల్, కాజల్‌మండల్, శుశు లిశిల్‌గా గుర్తించిన ఎక్సైజ్ పోలీసులు వారిని అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు. తనిఖీల్లో సీఐ శ్రీనివాస్, ఎస్ఐ శ్రీహరిరావుతో పాటు ఉద్యోగులు కరీం, హరీష్, వెంకట్, సుధీర్, విజయ్‌కుమార్, ఉపేందర్, వీరబాబు, స్వరూప పాల్గొన్నారు.

అంతరపంటలతో అదనపు ఆదాయం

- నాటడానికి ఇదే సరైన అదును
- విత్తనాల ఎంపికలో జాగ్రత్తలు, శుద్ధి తప్పనిసరి
- మధిర ఏఆర్ఎస్ ప్రధాన శాస్త్రవేత్త రుక్మిణీదేవి సలహాలు, సూచనలు



డాక్టర్ కె.రుక్మిణీదేవి



గత ఏడాది సాగు చేసిన పెసర (ఫైల్)



ఏపుగా పెరిగిన కంది పైరు (ఫైల్)

మధిర: వానాకాలం సీజన్‌లో పెద్దసంఖ్యలో రైతులు అపరాల పంటలు సాగు చేస్తారు. ఇందులో పెసర, మినుము, కంది ప్రధానంగా నిలుస్తున్నాయి. పప్పు ధాన్యాల సాగుతో భూసారం పెరుగుతుంది. అంతేకాక ప్రధాన పంటగా పత్తిలో అంతర పంటల సాగు ద్వారా అదనపు ఆదాయం సమకూరుతుంది. ఈ మేరకు అపరాల సాగుకు విత్తనాల ఎంపిక, తీసుకోవాల్సిన జాగ్రత్తలను మధిర వ్యవసాయ పరిశోధనా స్థానం ప్రధాన శాస్త్రవేత్త డాక్టర్ కె.రుక్మిణీదేవి వెల్లడించారు.

అనువైన రకాలు

మినుము: ఎంబీజీ -207, ఎంబీజీ- 1070, డబ్ల్యూబీజీ-26, పీయూ- 31, ఎల్ బీజీ- 752, ఎల్ బీజీ -787, టీబీజీ-104, జీబీజీ- 11.

పెసర: ఎంజీజీ-95, ఎంజీజీ -385, ఎంజీజీ-348, ఎంజీజీ- 347, డబ్ల్యూజీజీ -42, డబ్ల్యూజీజీ -37, టీఎమ్-96-2, వీపీఎమ్-2-14.

నేల తయారీ, విత్తనశుద్ధి

మినుము, పెసర సాగుకు జూన్ 1 నుంచి జూలై 15 వరకు అవకాశం ఉంటుంది. ఇందులో పెసర హెక్టార్‌కు 15-16 కిలోలు, మినుము 18-20కిలోల విత్తనాలు అవసరమవుతాయి. మురుగునీరు వెళ్లే వసతితో పాటు తేమను నిలుపుకోగలిగిన భూములు ఈ పంటల సాగుకు అనుకూలం. చౌడు భూములు పనికి రావు. వేసవి దుక్కి చేసి తొలకరి వర్షాలు పడగానే గొర్రుతో నేలను మెత్తగా తయారు చేసుకోవాలి. ఆఖరి దుక్కిలో హె క్టార్‌కు 20 కిలోల నత్రజని, 50 కిలోల భాస్వరం ఎరువులను హెక్టార్‌కు వేసి కలియదున్నాలి. ఆపై కిలోవిత్తనాలను 3 గ్రా ముల థైరమ్ లేదా కాప్టాన్ లేదా మ్యాంకోజబ్ మందుతో శుద్ధి చేశాక 5 గ్రాముల థయోమిథాక్సామ్ లేదా 5 మి.ల్లీ. ఇమిడాక్లోప్రిడ్ మందుతో విత్తనశుద్ధిచేసుకోవాలి. ఆపై విత్తేముందు 200 గ్రాముల రైజోబియం కల్చర్‌ను 10కిలోల విత్తనానికి పట్టిస్తే రసం పీల్చే పురుగులు, తెగుళ్ల బారి నుంచి కాపాడుకోవచ్చు.

కంది : అనువైన రకాలు, జాగ్రత్తలు

కంది సాగు చేసే రైతులు ఎంఆర్‌జీ-1004, ఐసీపీఎల్ -87119, పీఆర్ జీ-176, పీఆర్ జీ- 158, ఐసీపీ- 8863, డబ్ల్యూఆర్ జీ -121, డబ్ల్యూఆర్ జీ- 65, టీడీఆర్ జీ-4, డబ్ల్యు ఆర్ జీ-93, డబ్ల్యూఆర్ జీ- 255, టీడీఆర్ జీ-59 రకాలను ఎంచుకోవచ్చు. వెర్రి తెగులు ఉధృతి ఉన్న ప్రాంతాల్లో ఎల్ఆర్ జీ-105, టీఆర్ జీ-59, బీఎస్ఎంఆర్ -736, ఐసీపీఎల్-87119 రకాల సాగు మంచిది. అలాగే, గత పంట తాలూకు వెర్రి తెగులు సోకిన మొక్కలు, వాటి అవశేషాలను సమూలంగా నాశనం చేసేలా దుక్కులు చేయాలి. ఈ పంట సాగుకు మురుగునీరు వెళ్లే వసతిగల భూములు అనువైనవి. వేసవిలో తొలకరి వర్షాలు పడగానే గొర్రుతో మెత్తగా దున్నాక ఆఖరి దుక్కిలో హెక్టార్‌కు 20 కిలోల నత్రజని, 50 కిలోల భాస్వరము ఇచ్చే ఎరువులు వేసి కలియదున్నాలి. విత్తడానికి ముందు 10కిలోల విత్తనానికి 200 గ్రాముల రైజోబియం కల్చ ర్ పట్టించాలి. విత్తనాలు వేయడానికి జూన్, జూలై మాసాలు అనువైనవి. ఆగస్టు వరకు కూడా విత్తుకునే అవకాశం ఉన్నా మొక్కలు, సాళ్ల మధ్య దూరం తగ్గించాలి. ఎకరాకు 5-6 కిలో ల విత్తనాలు అవసరమవుతాయి. ఇక కంది పైరును 40-50 రోజులవరకు కలుపు బారి నుంచి రక్షించుకోవాలి. మొదట రెండు నెలల వరకు తరచుగా గొర్రు /దంతి సాయంతో అంతర కృషి చేయడం ద్వారా కలుపు నివారించవచ్చు. కలుపు బెడద ఎక్కువగా ఉంటే విత్తాక 24 గంటల్లోపు ఎకరానికి 1.0- 1.4 లీటర్ల పెండిమిథాలిన్ 200లీటర్ల నీటికి కలిపి పిచికారి చేయా లి. అలాగే, కందిలో అంతర పంటగా జొన్న, మొక్కజొన్న, సజ్జ, పెసర, మినుము, వేరుశనగ, సోయాచిక్కుడు, పత్తి లేదా పసుపు సాగు చేసుకోవచ్చు.

అంతర కృషి, సస్యరక్షణ

పెసర, మినుము పైరును 30 రోజుల వరకు కలుపు బారి నుంచి రక్షించుకోవాలి. 20-30 రోజుల దశలో గొర్రు / దంతి ద్వారా అంతర కృషి చేస్తే కలుపు నివారించడమే కాక తేమను నిలుపుకోవచ్చు. కలుపు అధికంగా ఉండే భూముల్లో విత్తగానే 24 గంటల్లోపు ఎకరాకు 1.0-1.40 లీటర్లు పెండిమిథాలిన్ 80శాతం ఈసీ 200 లీటర్లను నీటిలో కలిపి పిచికారీ చేయాలి. అంతేకాక తొలి దశలో చిత్తపురుగులు, తామర పురుగులు, తెల్ల దోమ, పేనుబంక, కాండపు ఈగ ఆశించే అవకాశముంది. ఇందులో కాండపు ఈగ నివారణకు ఎసిఫేట్ ఒక గ్రాము లేదా డైమిథోయేట్ 2 మి.లీ.ను లీటర్ నీటిలో కలిపి పిచికారీ చేయాలి. తామర పురుగు నివారణకు ఎసిఫేట్ ఒక గ్రాము లేదా ఫిప్రోనిల్ 1.5 మి.లీ. లేదా స్పైనోసాడ్ 0.3 మి.లీ.ను లీటర్ నీటికి, తెల్లదోమ నివారణకు లీటర్ నీటికి ఎసిటామాప్రిడ్ 0.2 గ్రాములు, పేనుబంక నివారణకు డైమిథోయేట్ 2 మి.లీ.ను లీటర్ నీటిలో కలిపి పిచికారి చేస్తే ఫలితం ఉంటుంది.